సాక్షి
ఖమ్మం
శనివారం ; 12 ; ఏప్రిల్ ; 2025



.. మోడల్‌గా నిలిచేలా!

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డులో షెడ్లు, కోల్డ్ స్టోరేజీ, ఇతర నిర్మాణాలను ప్రారంభించారు. 10లో



ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దేశానికి అన్నం పెట్టే రైతులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి గరిష్ట స్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు ప్రకాష్ నగర్‌లోని గోదాంను ప్రారంభించాక, 58వ డివిజన్ దొరన్న కాలనీలో సీసీ రోడ్లు, రఘునాథపాలెం మండలం జింకల తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

నేడు, రేపు మంత్రి తుమ్మల..

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శని, ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం సాయంత్రం 4గంటలకు ఖమ్మంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్న మంత్రి, 5గంటలకు నగరంలోని 58వ డివిజన్ దొరన్న కాలనీలో సీసీ రోడ్డు, రఘునాథపాలెం మండలం జింకల తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, ఆదివారం ఉదయం 9గంటలకు సత్తుపల్లి మండలం బుగ్గపాడులో వేద పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నారు.

20వరకు సెలవులో కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు వ్యక్తిగత సెలవులో వెళ్తున్నారు. ఇందులో కొన్ని ప్రభుత్వ సెలవులు ఉండగా, మిగతా రోజులు కలెక్టర్ సెలవు పెట్టారు. ఆయన తిరిగి విధుల్లో చేరేవరకు అదనపు కలెక్టర్ పి.శ్రీజకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, అంబేడ్కర్ జయంతి కలిపి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శని, ఆదివారం వారంతపు సెలవులు కాగా, సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి మంగళవారం నుంచి పంటల కొనుగోళ్లు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

వికాసం.. ఇదీ లక్ష్యం

'రాజీవ్ యువ వికాసం'లో యూనిట్ల కేటాయింపు

- ఎస్సీ, బీసీ శాఖలకు లక్ష్యాలు ప్రకటించిన ప్రభుత్వం
- ఈ సంఖ్య ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక..
- త్వరలోనే మైనార్టీ, గిరిజన శాఖలకు కూడా...



కేఎంసీలో రాజీవ్ యువవికాసం దరఖాస్తులు ఇస్తున్న జనం

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎందరికి లబ్ధి చేకూర్చాలనే అంశంపై కసరత్తు ఓ కొలిక్కివచ్చింది. ఈమేరకు జిల్లాకు లక్ష్యాలను నిర్దేశించగా.. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆ సంఖ్య ఆధారంగా యూనిట్లు కేటాయిస్తారు. జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 7,478, బీసీ అభివృద్ధి శాఖ ద్వారా 9,307 యూనిట్లు అందజేయాలని నిర్ణయించారు. అలాగే, మైనార్టీ, గిరిజన శాఖలకు సంబంధించి కసరత్తు చివరి దశకు చేరింది. ప్రణాళికలు సిద్ధమయ్యాక ఆయా శాఖల లక్ష్యాలను ప్రకటిస్తారు.

పోటెత్తుతున్న దరఖాస్తులు

నిరుద్యోగులకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేసేలా రాష్ట్రప్రభుత్వం ఇటీవల రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించింది. గతంలో కూడా సంక్షేమ శాఖల ద్వారా ఇలాంటి రుణాలు ఉన్నా, కొన్నేళ్లుగా అందడంలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించగానే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో బీసీ అభివృద్ధి శాఖ ద్వారా 31వేలకు పైగా, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 22వేల మేర దరఖాస్తులు వచ్చాయి. అలాగే, మైనార్టీ శాఖ ద్వారా మైనార్టీలు 4,739 మంది, క్రిస్టియన్లు 64మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 14వరకు దరఖాస్తు గడువు ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే, దరఖాస్తుదారుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా, రెండు రోజులుగా వెబ్‌సైట్ మొరాయిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్

జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌కు 7,478 యూనిట్లను లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ.133.42 కోట్ల నిధులు అవసరమని, ఇందులో సబ్సిడీ కింద రూ.103.28 కోట్లు, బ్యాంక్ రుణంగా రూ.30.14 కోట్లు ఖరారు చేశారు. ఇక రుణాల్లోనూ కేటగిరీలను ప్రకటించారు.

- బ్యాంక్ లింకేజీతో ఐఎస్‌బీ సెక్టార్ కింద రూ.లక్ష లోపు 2,066 యూనిట్లు, రూ.1.01 లక్షల నుండి రూ.2 లక్షల లోపు 1,603 యూనిట్లు, రూ.2.01 లక్షల నుండి రూ.3 లక్షలలోపు 1,019, రూ.3.01 లక్షల నుండి రూ.4 లక్షల లోపు 844 యూనిట్లు జిల్లాలో మంజూరు చేయాల్సి ఉంటుంది.
- వ్యవసాయం, ఉద్యానవన, సెరికల్చర్ యూనిట్లకు సంబంధించి రూ.2.01 లక్షల నుండి రూ.4 లక్షల లోపు 496 యూనిట్లను లక్ష్యంగా నిర్దేశించారు.
- చిన్న యూనిట్ల కింద రూ.50 వేల రుణానికి సంబంధించి 1,239 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, ఈ యూనిట్లకు వంద శాతం సబ్సిడీ ఉంటుంది.
- మైనర్ ఇరిగేషన్ పథకాలకు అందించే రుణాలకు బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా ప్రభుత్వం యూనిట్ల లక్ష్యాలను ప్రకటించింది. బోర్, మోటార్ కలిపి 117 యూనిట్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు యూనిట్లు 88, బోర్లకు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు యూనిట్లు ఆరింటిని కేటాయించారు. ఈ యూనిట్లకు బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా 100 శాతం సబ్సిడీ అమలవుతుంది.

బీసీ అభివృద్ధి శాఖ

బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఈబీసీల్లో అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధి జరుగుతుంది. బీసీలకు 5,891 యూనిట్లను లక్ష్యంగా నిర్దేశించగా.. రూ.68.39 కోట్లు కేటాయించారు. ఇక ఈబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 3,416 యూనిట్లు,రూ.39.66 కోట్లు నిధులు కేటాయించారు.

- వంద శాతం సబ్సిడీతో ఇచ్చే రూ.50 వేల యూనిట్లు 2,463, రూ.50,001నుండి రూ.లక్ష లోపు 90 శాతం సబ్సిడీతో 1,292 యూనిట్లు, 80శాతం సబ్సిడీతో రూ.1.01 లక్షల నుండి రూ.2 లక్షల లోపు 1,282 యూనిట్లు లక్ష్యంగా నిర్ధారించారు. అలాగే, 70శాతం సబ్సిడీతో రూ.2.01 లక్షల నుండి రూ.4 లక్షల లోపు 855 యూనిట్లకు కలిపి రూ.23.93 కోట్ల నిధులు కేటాయించారు.
- ఈబీసీ/ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి వంద శాతం సబ్సిడీతో రూ.50 వేల యూనిట్లు 1,428, 90శాతం సబ్సిడీతో రూ.50,001 నుండి రూ.లక్ష లోపు రుణ యూనిట్లు 749, రూ.1.01 లక్షల నుండి రూ.2 లక్షల లోపు 744 యూనిట్లను 80శాతం సబ్సిడీతో, రూ.2.01లక్షల నుండి రూ.4లక్షల లోపు 496 యూనిట్లను 70శాతం సబ్సిడీతో లక్ష్యంగా నిర్దేశించారు.

విద్య ప్రాధాన్యతను చాటిన మహనీయుడు

పూలే జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: చదువుతోనే జీవితంలో మార్పు వస్తుందని ఏళ్ల క్రితమే విద్య ప్రాధాన్యతను చాటిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన పూలే జయంతి వేడుకలు నిర్వహించగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. గతంలో వర్ణ, కుల వ్యవస్థ కారణంగా దళితులు, బడుగు బలహీన వర్గాల వారు వివక్షకు గురవుతుండగా, అప్పట్లోనే అందరికీ చదువు అవసరమని పూలే చాటి చెప్పారని అన్నారు. అంతేకాక గాంధీ, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు పూలే స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆతర్వాత శ్రీశ్రీ సర్కిల్‌లోని పూలే విగ్రహం వద్ద కూడా అదనపు కలెక్టర్ నివాళులర్పించారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏఓ అరుణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, బీసీ సంఘాల నాయకులు పుచ్చకాయల వీరభద్రం, అయితగాని శ్రీనివాస్ గౌడ్, ఎం.కృష్ణమాచార్యులు, శివకృష్ణ, షేక్ అబ్దుల్ రెహ్మాన్, కె.రోశయ్య యాదవ్, మల్సూర్ యాదవ్, షేక్ షకీనా తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు ధాన్యం తరుగు తీయొద్దు..

ఖమ్మం సహకారనగర్: కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకొచ్చే ధాన్యంలో మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. అయితే, కేంద్రాల నుంచి తీసుకొచ్చే ధాన్యంలో కొందరు మిల్లర్లు బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. తూర్పార పట్టాకే మిల్లులకు తరలిస్తున్నందున తరుగు తీయొద్దని, ఒకవేళ నాణ్యత లేదని తేలితే ఏఈఓలు,కేంద్రాల నిర్వాహకులకు మెమో జారీ చేస్తామని చెప్పారు. డీసీఓ చందన్‌కుమార్, డీఎస్ఓ గంగాధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి.శ్రీలత పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి : సీపీ



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని.. తద్వారా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధి సెక్టార్ అధికారులతో ఖమ్మం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. హనుమాన్ జయంతి ర్యాలీలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ర్యాలీ జరిగే ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటే స్టేషన్ హౌస్ ఆఫీసర్ దృష్టికి తీసుకురావాలని సీపీ తెలిపారు. అంతేకాక ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలులో నిర్వహించే సమావేశాలకు ఆటంకాలు ఎదురుకాకుండా పర్యవేక్షించాలని చెప్పారు. అలాగే, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ కార్యకలాపాలపై నిఘా పెట్టి, సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యతపై స్థానికులకు అవగాహన కల్పించాలని సీపీ సూచించారు. వీసీలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బడి తెరిచే నాటికి యూనిఫామ్

అదనపు కలెక్టర్ శ్రీజ



విద్యార్థుల యూనిఫామ్ కుడుతున్న మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం: వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు యూనిఫామ్ సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. తిరుమలాయపాలెంలో శుక్రవారం ఆమె పర్యటించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన ఆమె రాజీవ్ యువ వికాసం పథకం కోసం అందిన దరఖాస్తులపై ఆరా తీశారు. ఆతర్వాత ఐకేపీ కార్యాలయానికి వెళ్లగా, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుడుతున్న మహిళలతో మాట్లాడారు. గతంలో మాదిరి ఒకే కొలతతో కాకుండా విద్యార్థుల వ్యక్తిగత కొలతలతో ఈసారి యూనిఫామ్ సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాక విద్యాసంవత్సరం మొదటిరోజునే పిల్లలకు యూనిఫామ్ ఇచ్చేలా పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. అనంతరం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా మంజూరైన ఇందిరమ్మ గృహాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారుల్లో ఐదుగురు నిరుపేదలకు ఐకేపీ ద్వారా రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించామని ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు చెప్పగా అభినందించారు. ఆతర్వాత మోడల్ ఇందిరమ్మ గృహం పనులు, కేజీబీవీలో పరిశుభ్రత, వంటగదిని పరిశీలించి మెనూ అమలుపై విద్యార్థులో మాట్లాడారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంఈఓ శ్రీనివాసరావు పీఆర్ ఏఈ ప్రఫుల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే నివేదిక!

- పాఠశాలల సమగ్ర సమాచారంతో రూపకల్పన
- జిల్లాలోని స్కూళ్లు, విద్యార్థుల వివరాలు నమోదు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో సమర్పించిన అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యావ్యవస్థలో కీలక మార్పులు తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే జిల్లాల వారీగా పాఠశాలలు, వీటి మధ్య దూరం, ఆవాసాలకు ఎంత దూరాన స్కూళ్లు ఉన్నాయి, ఎందరు విద్యార్థులు చదువుతున్నారనే వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, పాఠశాలల వారీగా విద్యార్థులు, హ్యాబిటేషన్ల వివరాలు పంపించాలని ఉన్నతాధికారులు నాలుగురోజుల క్రితం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ మండలాల వారీగా ఎంఈఓలతో మాట్లాడి పూర్తి వివరాలు ఇవ్వాలని రాత్రికి రాత్రే ఆదేశించడం.. ఆ వెంటనే వివరాలు సమర్పించగానే హైదరాబాద్‌లో సమర్పించడం చర్చనీయాంశంగా మారింది. కాగా, జిల్లాలోని 33 ప్రాథమిక పాఠశాలలు ఆవాసాలకు కిలోమీటరున్నర దూరాన ఉన్నట్లు ఈ నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. ఆయా పాఠశాలల్లో పది మంది లోపే విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారని తెలిసింది.

ఎందుకీ వివరాలు..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, విద్యార్థుల వివరాలపై ఆరా తీయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తాజాగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ క్రమంలోనే వివరాలు సేకరించడంతో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీపంలోని స్కూళ్లలో విలీనం చేస్తారా అన్న ఊహాగానాలు మొదలయ్యాయి. అంతేకాక ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలలకు ఇక్కడి టీచర్లను బదిలీ చేసే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు.

గణనీయమైన మార్పులు


వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాల విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వివరాలు సేకరిస్తున్నట్లుగా సమాచారం. ఈ నివేదికల ఆధారంగా తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీపంలోని స్కూళ్లలో విలీనం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఓవైపు పాఠశాలలను మరమ్మతులతో ముస్తాబు చేస్తుండగా.. ఇప్పుడు విలీనంపై ప్రచారం మొదలవడం గమనార్హం.

వివరాలు పంపించాం ..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలతో నివేదిక పంపించాం. ఎంఈఓలు, హెచ్‌ఎంల నుంచి పూర్తిస్థాయిలో సేకరించిన వివరాలను నివేదికలో పొందుపరిచాం.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

సాగర్ ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేత



సాగర్ ఎడమ కాల్వలో నిలిచిన నీరు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని ఆయకట్టుకు సాగునీటి సరఫరాను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. అంతేకాక పాలేరు కాల్వకు కూడా నీటి విడుదల నిలిచిపోయింది. జిల్లాలో యాసంగి పంటల సాగు పూర్తవడంతో సాగర్ ప్రాజెక్టు నుండి గురువారమే నీటి సరఫరా ఆగిపోగా, పాలేరు నుండి దిగువకు నీటి విడుదల నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, సాగర్ నుంచి నీటి సరఫరా ఆగినా ప్రస్తుతం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సాగర్ నుండి 45 టీఎంసీల నీటిని పాలేరుకు విడతల వారీగా విడుదల చేయగా ఇందులో 25టీఎంసీలు జిల్లా అవసరాలకు, మరో 20 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలించినట్లు అధికారులు తెలిపారు. కాగా, పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23అడుగులకు గాను శుక్రవారం సాయంత్రానికి 21.07 అడుగులు ఉండగా, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేనట్లేనని చెబుతున్నారు.

క్లుప్తంగా

కేఎన్ఎం-1638 రకంతో అధిక దిగుబడి



వరి పైరులో డీఏఓ పుల్లయ్య, అధికారులు, రైతులు

వైరారూరల్: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అందజేసిన కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని అష్టగుర్తిలో కేఎన్ఎం రకంతో సాగు చేసిన వరి పొలాలను శుక్రవారం పరిశీలించిన ఆయన రైతులకు సూచనలు చేశారు. ఈ రకంతో పంట 120 రోజుల్లో కోతకు వస్తుందని, అగ్గితెగులు, ఉల్లికోడు తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని తెలిపారు. పంట ఏపుగా పెరిగి అధిక దుబ్బులతో కంకులు ఏర్పడతాయని, దిగుబడి ఎకరాకు 30-35 బస్తాలు వస్తుందని డీఏఓ వెల్లడించారు. ఏడీఏలు తుమ్మలపల్లి వాసవి రాణి, ఏఓలు మయాన్ మంజూఖాన్, ప్రత్యూష, పవన్‌కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న వైజాగ్ - తమిళనాడు జట్లు

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లిలో నిర్వహిస్తున్న ఐదు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం రెండోరోజుకు చేరాయి. కుర్నవల్లిలోని వేంకటాచలపతి దేవాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యాన తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు జరిగిన మ్యాచ్‌లో ఏపీలోని వైజాగ్ జట్టుపై తమిళనాడు జట్టు విజయం సాధించింది. శనివారం పోటీలు ముగియనుండగా, విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కల్లూరు: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. కల్లూరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గ్రామగ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించాక ఎల్కతుర్తి బయలుదేరాలని కోరారు. ఈసమావేశంలో మాజీ జెడ్పీటీసీలు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, మేకల కృష్ణ, నాయకులు నర్వనేని అంజయ్య, బొల్లం వెంకటేశ్వరరావు, దేవరపల్లి భాస్కర్‌రావు, కాటమనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, కళ్యాణపు కొండలరావు, ఎస్.కే.కమ్లి, సీహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవదానం



నవీన్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం గ్రామానికి చెందిన బత్తుల నవీన్ (22) ఓ కంపెనీలో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తుండగా నాలుగు రోజుల క్రితం ఖమ్మం రూరల్ మండలం మారెమ్మగుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు వైద్యులు అవగాహన కల్పించగా, ఆయన కుటుంబీకులు అవయవాలను దానం చేశారు. అనంతరం శుక్రవారం నవీన్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు.

పట్టు పరిశ్రమల సందర్శన

ఖమ్మంవ్యవసాయం: పట్టు పరిశ్రమ, మల్బరీ తోటల పెంపకంపై అవగాహన కల్పించేలా జిల్లా రైతులకు స్టడీ టూర్ ఏర్పాటుచేశారు. వైరా మండలం రెబ్బవరం, గన్నవరం గ్రామాలకు చెందిన 30రైతులను శుక్రవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి కోరింతకుంటకు తీసుకెళ్లారు. అక్కడ మల్బరీ తోటలు, పట్టు పరిశ్రమలను పరిశీలించి రైతులు అనుభవాలను తెలుసుకున్నారు. జిల్లా పట్టు పరిశ్రమ ఉపసంచాలకులు ముత్యాలు, అధికారులు కామేశ్వరరావు, దేవరాజు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

మార్కెట్.. మోడల్‌గా నిలిచేలా !

- ఖమ్మం మార్కెట్‌లో ఏడు షెడ్లు, కోల్డ్ స్టోరేజీతో మిర్చి యార్డు
- రూ.155.30 కోట్ల నిధులతో దశల వారీగా పనులు
- ఇప్పటికే మొదలైన 5, 6వ షెడ్ల నిర్మాణం



మిర్చి యార్డులో మొదలైన 5వ షెడ్ నిర్మాణ పనులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులు మొదలయ్యాయి. ఈమేరకు 15.39 ఎకరాల్లో మిర్చి యార్డుగా ఏడు షెడ్లు, ఒక కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్రంలోనే రెండో పెద్దదిగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పేరుంది. విదేశాల్లో డిమాండ్ ఉన్న తేజా రకం మిర్చి కొనుగోళ్లు తెలుగు రాష్ట్రాల్లోనే ఇక్కడ ఎక్కువగా జరుగుతాయి. ఏటా రూ.5 వేల కోట్ల నుంచి రూ.6 వేల కోట్ల మేర మిర్చి లావాదేవీలు జరుగుతాయని అంచనా. తద్వారా మార్కెట్‌కు రూ.30 కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. దీంతో మార్కెట్‌లోని మిర్చి యార్డులను ఆధునికీకరించాలన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో మార్కెటింగ్ శాఖ, ఆర్కిటెక్ నిపుణులు డిజైన్లు రూపొందించారు. ఈ డిజైన్ల ఆధారంగా చేపడుతున్న పనులు పూర్తయితే సీజన్‌లో 2లక్షల మిర్చి బస్తాలు వచ్చినా కింద పెట్టకుండా క్రయవిక్రయాలు పూర్తిచేసే అవకాశం ఏర్పడుతుంది.

రూ.155.30 కోట్ల నిధులతో...

మోడల్ మార్కెట్‌గా గుర్తింపు తీసుకొచ్చేలా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.155.30 కోట్లతో మిర్చి యార్డు నిర్మిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఈ మార్కెట్‌కు వచ్చే మిర్చి ఆధారంగా నిర్మాణాలు మొదలయ్యాయి. ఏడు షెడ్లు, ఒక కోల్డ్ స్టోరేజీతో పాటు పాలనాపరమైన కార్యకలాపాలకు అనుకూలంగా నిర్మాణాలు, రైతుల విశ్రాంతి గదులు, వ్యాపారులు, కమిషన్ వ్యాపారులు, దడవాయిలు, కార్మికుల కోసం నిర్మాణాలు ఉంటాయి.

దశల వారీగా నిర్మాణ పనులు

మిర్చి యార్డు ఆధునికీకరణ పనులు దశల వారీగా చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం మిర్చి సీజన్ కావడంతో నిత్యం 80 వేల నుంచి లక్ష బస్తాల వరకు విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో ఒక యార్డు, కూల్చివేసిన వేర్ హౌసింగ్ గోదాంలు, జిల్లా మార్కెటింగ్ శాఖ భవనం, కార్మికుల భవనాలను తొలగించి నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఏడు షెడ్లకు గాను ప్రస్తుతం 5, 6వ షెడ్లు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇందులో ఐదో నంబర్ షెడ్ సింగిల్ ఫ్లోర్ కాగా, ఆరో నంబర్ రెండతస్తులతో ఉంటుంది. వీటితో పాటు పరిపాలన భవనం నిర్మాణ పనులు కూడా చేపడుతుండగా.. ఇందులోనే రైతు విశ్రాంతి భవనం, హమాలీలు, దడవాయిలు, కార్మికుల కోసం సమావేశ హాల్ ఉంటుంది.

వచ్చే నెలలో మరికొన్ని పనులు

ఎండల నేపథ్యాన మే నెలలో మిర్చి క్రయవిక్రయాలను నిలిచిపోయాయి. దాదాపు నెల పాటు మిర్చి యార్డుకు సెలవులు ప్రకటించనుండడంతో ఆ సమయాన మిగతా పనులు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. నిర్దేశిత ప్లాన్ ఆధారంగా నాలుగు పెద్ద షెడ్లు, ఇతర నిర్మాణాలను చేపట్టనున్నారు. మొత్తం పనులను వచ్చే ఏడాది మిర్చి సీజన్ నాటికి పూర్తి చేసి, అందులోనే క్రయవిక్రయాలు నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు.



ప్రారంభమైన పరిపాలన భవన నిర్మాణం

ప్రణాళికాయుతంగా నిర్మాణాలు



మిర్చి మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రణాళికయుతంగా చేపడుతున్నాం. నిపుణులను రూపొందించిన డిజైన్ల ఆధారంగా నిర్మాణాలు ఉంటాయి. ప్రస్తుతం మిర్చి క్రయవిక్రయాలకు ఇబ్బంది ఎదురుకాకుండా దశల వారీగా నిర్మాణాలు చేపట్టేలా పర్యవేక్షిస్తున్నాం. – పి.ప్రవీణ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

▼ ఎండకు ఏం కావొద్దని...

ఎండ తీవ్రత నానాటికీ పెరుగుతోంది. మధ్యాహ్నం జిల్లాలో గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఖమ్మం ముస్తఫానగర్ వద్ద వాహనంపై పండ్ల వ్యాపారం చేసే ఓ వ్యక్తి.. వాహనం టైర్లకు ఎండ కారణంగా ఏం కావొద్దని ఇలా గోనె సంచులు కప్పాడు. తరచుగా గోనె సంచులపై నీళ్లు చల్లుతుండగా.. అద్దాలకు వేడి తగలకుండా టార్పాలిన్ కప్పాడు. టైర్లు, అద్దాలకు ఏమైనా అయితే రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము మరమ్మతులకే పెట్టాల్సి వస్తుందని.. అందుకే ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సదరు వ్యక్తి చెప్పాడు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



తాకట్టు రుణాల్లో అక్రమాలు జరిగాయని ఆందోళన



డీసీసీబీ సీఈఓతో మాట్లాడుతున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: తాకట్టు రుణాల్లో అక్రమాలు జరిగాయంటూ ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలోని 267 సర్వేనంబర్ ఆధారంగా చావిడి రామారావు, చావిడి నాగమణి డీసీసీబీ నుంచి తీసుకున్న మార్ట్‌గేజ్ రుణాల్లో అక్రమాలు జరిగాయని వారు ఆరోపించారు. తమ భూముల డాక్యుమెంట్లను ఖమ్మం రూరల్ బ్యాంకు బ్రాంచ్‌లో తాకట్టు పెట్టి 2021లో రూ.59లక్షల రుణం తీసుకున్నారని తెలిపారు. ఈ రుణానికి సంబంధించి ఇంకా రూ.48 లక్షల బకాయి ఉన్నందున తమకు న్యాయం చేయాలని రైతులు అజ్మీరా భాస్కర్, సంధ్య, రూప్సీ, మంగమ్మ, నీల, కోట్య తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంకు సీఈఓ ఎస్.వెంకట్ ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా 267 సర్వే నంబర్ భూమి వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై సీఈఓను వివరణ కోరగా భూమి ఆధారంగా నిబంధనల మేరకు మార్ట్‌గేజ్ రుణం ఇచ్చామని, అది రికవరీ చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆ ఇసుక డంప్‌లు సూర్యాపేట పరిధిలోవి..



ఏటి మధ్యలో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో భారీగా ఇసుక డంప్ చేశారనే సమాచారంతో శుక్రవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. అలాగే, మండలంలోని పైనంపల్లి, రామచంద్రాపురంల్లో పరిశీలించి ఉన్న ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అయితే, పాలేరు ఏటి ఆవల ఉన్న ఇసుక డంప్‌లు సూర్యాపేట జిల్లా పరిధిలోకి వస్తాయని నిర్ధారించారు. ఆతర్వాత ఏటి మధ్యలో వేసిన రోడ్డును పరిశీలించి ఇసుక తరలింపునకు వేశారా, లేదా అని ఆరా తీశారు. కాగా, రోడ్డు ఎవరు వేశారో తేలాల్సి ఉందని.. కానీ రోడ్డును తొలగిస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ జె.మాణిక్‌రావు, ఎంఆర్ఐ ఆలస్యం మధుసూధన్‌రావు, ఎస్సై సంతోష్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న లోడు లారీని అడ్డుకున్న రైతులు

జూలూరుపాడు: మొక్కజొన్న కంకులు తీసుకెళ్తున్న లారీని జూలూరుపాడులో రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. పంటకు డబ్బు చెల్లించకుండా విత్తన కంపెనీ బాధ్యులు జూలూరుపాడులోని ఓ వే బ్రిడ్జి వద్ద లారీలో లోడ్ చేసుకొని తీసుకెళ్తుండగా, చంద్రుగొండ మండలం పోకలగూడెం, గానుగపాడు, బాల్యా తండా, జూలూరుపాడు మండలం గంగారంతండాకు చెందిన రైతులు అడ్డగించారు. వివిధ కంపెనీల ఏజెంట్లు ఎకరాకు 4 – 5 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని చెప్పి, అలా జరగకపోతే రూ.75 వేలు పరిహారం ఇస్తామని నమ్మించినట్లు తెలిపారు. కానీ, పరిహారం చెల్లించకపోగా పండిన పంటకు డబ్బు చెల్లించకుండా తీసుకెళ్తున్నారని ఆరోపించారు. గ్రామాల నుంచి కంకులతో లారీని జూలూరుపాడు వే బ్రిడ్జి వద్దకు తీసుకొచ్చి, సాయంత్రం వరకు డబ్బు ఇవ్వకపోవడంతో అడ్డుకున్నామని తెలిపారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించగా, విత్తన కంపెనీలపై ఫిర్యాదు చేశారు. కాగా, రైతులను నమ్మించి మోసం చేసిన మొక్కజొన్న విత్తన కంపెనీ డీలర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐయూకేఎస్ నాయకుడు బానోత్ ధర్మా డిమాండ్ చేశారు. రైతులు భూక్యా లక్ష్మణ్, వస్రాం, బాలు, మంగీలాల్, రాంబాబు, ప్రసాద్, వెంకటేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అడుగడుగునా అవాంతరాలే...



తనికెళ్లలో రోడ్డు పక్కన వేసిన మక్కల బస్తాలు

కొణిజర్ల: విత్తన కంపెనీల మాటల నమ్మి ఆడ, మగ రకం మొక్కజొన్న సాగు చేసిన రైతులు అడుగడుగునా అవాంతరాలు ఎదుర్కొన్నారు. కొణిజర్ల మండలంలో ఈ రకం మొక్కజొన్నలు 10వేల ఎకరాల్లో సాగు చేయగా, కొందరు రైతులకు చెప్పిన దిగుబడితో పోలిస్తే తక్కువ రాగా, మరికొందరికి ఎక్కువగా వచ్చాయి. చివరకు రైతులు కంపెనీల బాధ్యులకు మొక్కజొన్నలు అప్పగించారు. కాగా, మొక్కజొన్నలను తరలించే క్రమాన అకాల వర్షం కురవడంతో తనికెళ్లలోని ఓ వేయింగ్ మిషన్ వద్ద ఆరబెట్టారు. ఆపై కొన్ని బస్తాలను లారీలో తరలించగా, ఇంకొన్ని రోడ్డు పక్కనే కనిపిస్తున్నాయి.

నేటి నుంచి అగ్నివీర్ దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం రాపర్తినగర్: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి అగ్నివీర్ దరఖాస్తులను శనివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. జనరల్ డ్యూటీ, టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తుదారులకు నిర్ణీత తేదీల్లో ర్యాలీ నిర్వహిస్తారని వెల్లడించారు. కాగా, పరీక్ష 13 భాషల్లో జరగనుండగా పదో తరగతి ఉత్తీర్ణత, ఐటీఐ, డిప్లొమా సర్టిఫికెట్ కలిగిన వారు అర్హులని, ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే బోనస్ మార్కులు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www.joinindiaarmy.nic.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-27740205 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత తలసేమియా పరీక్షలు ప్రారంభం

భద్రాచలంటౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం రూ.5 లక్షల విలువైన 1800 వ్యాధి నిర్ధారణ కిట్లను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్.కాంతారావుతో పాటు వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వి.కామేశ్వరరావు, గోళ్ల భూపతిరావు, జి.సంజీవరావు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెనుబల్లి మండలం చౌడవరం గ్రామానికి చెందిన సడియం వంశీ వీఎం.బంజర్ జెడ్పీహెచ్ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం పాఠశాల నుండి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలవడంతో హైదరాబాద్ తరలించారు. వంశీ కుటుంబ పరిస్థితులు తెలుసుకున్న ఉపాధ్యాయులు రూ.లక్షకు పైగా నగదు సేకరించి చికిత్స నిమిత్తం అందజేశారు. అయినా ఫలితం లేకపోగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ జి.సూరజ్ తెలిపిన వివరాలు... మండలంలోని పల్లిపాడుకు చెందిన గాజనబోయిన శేషయ్య(78) రోజులాగే శుక్రవారం ఉదయం వాకింగ్ కోసం రోడ్డు దాటుతుండగా వైరా వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శేషయ్య తలకు తీవ్ర గాయం కాగా, ద్విచక్రవాహనం నడుపుతున్న వైరా మండలం దాచాపురానికి వి.వెంకటేశ్వరరావుకు కూడా గాయపడ్డాడు. ఈమేరకు శేషయ్యను 108లో ఖమ్మం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ వెల్లడించారు. కాగా, సీపీఎం సానుభూతిపరుడైన శేషయ్య మృతదేహం వద్ద వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు నివాళులర్పించారు.

గంజాయి స్వాధీనం, విక్రేత అరెస్ట్



గంజాయి, నిందితుడితో పోలీసులు

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్ బస్టాండ్‌లో గంజాయి కలిగిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన బోయిన వెంకటరమణ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నాడు. ఈమేరకు బస్టాండ్‌లో చేపట్టిన తనిఖీల్లో ఆయన పట్టుబడగా 1,100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

జమలాపురంలో మాజీ సీజేఐ

వెంకటేశ్వరస్వామికి పూజలు చేసిన జస్టిస్ ఎన్.వీ.రమణ



పూజలు చేస్తున్న ఎన్.వీ.రమణ దంపతులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.రమణ దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా వారికి ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత వారికి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించిన అర్చకులు.. శేషవస్త్రాలు, ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి పాల్గొన్నారు.

రైతులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంరూరల్: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చెడు అలవాట్లను దూరంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. రూరల్ మండలంలోని కాచిరాజుగూడెంలో ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై రైతులతో సమావేశమవుతున్న నేపథ్యాన ఇప్పటితో పోలిస్తే గత తరాల వారు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈమేరకు శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వారు వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఆరోగ్యంతో పాటు చదువు మాత్రమే భవిష్యత్ తరాలకు ఇచ్చే ఆస్తి అని గుర్తించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. సంఘం చైర్మన్ బీరెల్లి నాగచంద్రారెడ్డి, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కళావతిబాయి, తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి..

డీఎంహెచ్ఓ కళావతిబాయి



మాట్లాడుతున్న అధికారి, పక్కన డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శుక్రవారం జాతీయ ఆరోగ్య మిషన్ అమలుచేసే పథకాలపై అవగాహన కల్పించాలరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో మందుల వివరాలను ఈ-ఔషధిలో నమోదు చేయాలని, స్టాక్ వివరాలు అందరికీ కనిపించేలా బోర్డుపై రాయాలని తెలిపారు. అనంతరం కొత్తగా అమల్లోకి వచ్చిన పోర్టల్లు, అందులో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు వెంకటరమణ, రామారావు, ఏఓ మోతియా మాట్లాడగా వివిధ విభాగాల అధికారులు సుబ్రహ్మణ్యం, రాజేందర్, ఉమాదేవి, రమాదేవి, అన్వర్, దుర్గ, జైసీ సీభా, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'పంటల కొనుగోలులో విఫలమైన రాష్ట్రప్రభుత్వం'



వైరాలో కల్లాల వద్ద రైతులతో మాట్లాడుతున్న నాయకులు

వైరా/తల్లాడ: రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లకు సకాలంలో కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. కొణిజర్ల, వైరా, ఏన్కూరు, తల్లాడ మండలాల్లో శుక్రవారం ఆయన బీజేపీ, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, చావా కిరణ్‌తో కలిసి పర్యటించారు. మొక్కజొన్న, మిర్చి, మొక్కజొన్న కల్లాలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నాక ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న హామీని నెరవేర్చకపోగా, రైతుల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. వరికి మద్దతు ధర కేంద్రమే చెల్లిస్తుండగా, రాష్ట్రమే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. ఇకనైనా ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటుచేయాలని మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో నాయకులు చిలుకూరి రమేష్, మందడపు సుబ్బారావు, ఆర్‌వీఎస్.యాదవ్, రవీందర్, రుద్రగాని మాధవ్, అంజయ్య, గోపాలకృష్ణ, కల్యాణ్, అనిల్, మురళి, ఆదినారాయణ, మాదినేని సతీష్, చల్లా నాగులు, ఆపతి వెంకటరామారావు, బాలాజీనాయక్, గాదె కృష్ణారావు, పెరికె కిరణ్, కృష్ణ, ఉద్దగిరి రామారావు, రాయల రమేష్, సంగీతం సాయిచంద్ పాల్గొన్నారు.

నరసింహస్వామి గుట్ట వద్ద మంటలు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని నరసింహస్వామి ఆల యగుట్ట వద్ద శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఆలయానికి వెళ్లే ర్యాంప్ పక్కన ఎండిన చెత్త అంటుకోవడంతో మంటలు మొదలైనట్లు తెలుస్తోంది. దీంతోఅప్రమత్తమైన ఆలయ సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలుఆర్పివేశారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి ఆర్పకుండా వేయడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.